
## పట్నంకు నిరంజన్‌రెడ్డి పరామర్శ

లగచర్ల ఘటనలో అక్రమంగా అరెస్టై చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని సోమవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి పరామర్శించారు.



# తప్పిదాలకు అవకాశమివ్వొద్దు

- ఇందిరమ్మ ఇండ్ల సర్వే సమగ్రంగా చేపట్టాలి
- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి
- జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం
- ప్రజావాణికి 67 ఫిర్యాదులు



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఆదిబట్ల, డిసెంబర్ 16 : ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో తప్పిదాలకు అవకాశం ఇవ్వొద్దని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం ఆయన జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా సమీక్షించి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల సర్వేను నెలాఖరు వరకు పూర్తి చేయాలన్నారు. మార్గదర్శకాలను పాటిస్తూ ..వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు ఎంట్రీ చేయాలన్నారు. కామన్ డైట్ ప్లాన్ ప్రోగ్రామ్‌ను జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు / పాఠశాలల్లో సక్రమంగా అమలు జరిగేలా చూడాలన్నారు.

**ఫిర్యాదులను పరిష్కరించాలి..**

ప్రజావాణిలో ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జరిగిన ప్రజావాణికి 67 ఫిర్యాదులు వచ్చాయన్నారు. రెవెన్యూ శాఖ నుంచి 52 ఇతర శాఖల నుంచి 15 ఉన్నాయన్నారు. సంబంధిత శాఖల అధికారులు తక్షణమే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

### కలెక్టర్‌ను కలిసిన జిల్లా గెజిటెడ్ అధికారులు

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డిని సోమవారం జిల్లా గెజిటెడ్ అధికారులు కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామారావు, కార్యదర్శి శ్రీనేశ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు వెంకటేశ్, ట్రెజరర్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, అలివేలు మంగ, సంయుక్త కార్యదర్శులు అనిత, సుజాత, సైదమ్మ, రాకేశ్ తదితరులు ఉన్నారు.



# చలి బాబోయ్.. చలి..

## రోజురోజుకూ తగ్గుతున్న ఉష్ణోగ్రతలు.. గ్రామీణ ప్రాంతాల్లో చలి తీవ్రత అధికం.. చలిమంటలతో రక్షణ పొందుతున్న జనం

ఇబ్రహీంపట్నంరూరల్/వికారాబాద్, డిసెంబర్ 16 : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సోమవారం రికార్డు స్థాయిలో 6.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో వాతావరణ శాఖ ఉమ్మడి జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో చలి తీవ్రత పెరుగడంతో జనాలు బయటికి రావాలంటే జంకుతున్నారు. బారెడు పొద్దెక్కినా సూర్యుడు మబ్బుల చాటునే ఉంటున్నాడు. ఎముకలు కొరికే చలిగాలులు వీస్తుండడంతో రోగాల బారినపడే అవకాశమున్నదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శ్వాస సంబంధ ఇబ్బందులున్న వారు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఇది ఇలా ఉండగా చలి పెరుగడంతో ఛాయ్‌బండ్లకు గిరాకీ పెరిగింది. సాధారణ రోజుల్లో కంటే టీ అమ్మకాలు రెండింతలు పెరిగాయని నిర్వాహకులు పేర్కొంటున్నారు.



పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు చలితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో ఉదయం పూట ఎక్కడ చూసినా చలి మంటలు వేసుకోవ డం కనిపిస్తున్నది. రాత్రిపూట వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు బ్లాంకెట్లు, గొంగళ్లు, మంకీ క్యాప్‌లు, మఫ్లర్‌లను తీసుకెళ్లాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- చలికి బయటికి వెళ్లలేకపోతే ఇంట్లోనైనా కొంత సమయం వ్యాయామం, యోగా చేస్తే శరీరంలో చురుకుదనం, రోగనిరోధక శక్తి పెరుగుతుంది..
- ఉష్ణోగ్రతలు తగ్గే కొద్దీ రక్త నాళాలు సంకోచించి గుండెపై భారం పడుతుంది కాబట్టి, గుండె జబ్బులు, బీపీ, షుగర్ ఉన్నవారు రెండు వారాలకోసారైనా వైద్య పరీక్షలు చేయించుకుంటే మంచిది..
- చల్లదనానికి ఊపిరితిత్తుల్లోని పొరలు ఎక్కువగా స్పందిస్తాయి. వాతావరణంలోని దుమ్ము, ధూళి వల్ల అలర్జీ, ఆస్తమా, దగ్గు, ఆయాసం వంటి శ్వాసకోశ వ్యాధులు సోకే ప్రమాదమున్నది కాబట్టి, నిత్యం గోరు వెచ్చని నీటిని తీసుకోవాలి..
- బయటి ఫుడ్‌ను తీనకూడదు.. ఇంట్లోనే వేడి వేడి ఆహారాన్ని తీసుకుంటే మంచిది..
- కూలింగ్ పదార్థాలు, పానీయాల జోలికి అస్సలు వెళ్లొద్దు.
- చర్మం పొడిబారకుండా శరీరానికి బాడీ లోషన్స్ లేదా కొబ్బరి నూనె రాసుకోవాలి
- గర్భిణులు, చిన్నపిల్లలు బయటికి రాకపోవడమే ఉత్తమం. అత్యవసరమైతే స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు ధరించాలి

## హామీల అమల్లో సర్కార్ విఫలం

- బీఆర్‌ఎస్ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి



ధారూరు, డిసెంబర్ 16 : హామీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్‌లేక గ్రామాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. ఇప్పటివరకూ రైతుభరోసా ఇవ్వలేని నిస్సహాయ స్థితిలో రేవంత్ సర్కార్ ఉన్నదని మండిపడ్డారు. సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తే ఓడిపోతామనే భయంతోనే వాటి నిర్వహణకు సర్కారు ముందుకు రావడం లేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి పథంలో ముందున్నాయని ఆయన గుర్తు చేశారు.





## మానవత్వం చాటిన మంచాల సీఐ

మంచాల సీఐ మధు మానవత్వం చాటుకున్నారు. ఇబ్రహీంపట్నం పరిధిలోని శ్రీ ఇందు ఇంజినీరింగ్ కళాశాలలో గ్రూప్-2 పరీక్ష రాసేందుకు సోమవారం ఉదయం ఓ గర్భిణి వచ్చింది. అయితే ఆమె మెయిన్ గేట్ నుంచి పరీక్షా కేంద్రంలోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నది. విధుల్లో భాగంగా అక్కడే ఉన్న మంచాల సీఐ మధు ఆమె అవస్థను గమనించి తన వాహనం లో దగ్గరుండి 400 మీటర్ల దూరం లో ఉన్న కేంద్రానికి తీసుకెళ్లారు. గర్భిణి పట్ల ఉదారత చాటిన సీఐ మధు, ఏఎస్ఐ సతీశ్‌కుమార్‌ను అక్కడ ఉన్న వారు ప్రశంసించారు. -ఆదిబట్ల, డిసెంబర్ 16



## ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలి

విద్యాశాఖలో కొనసాగుతున్న సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు చేపట్టిన దీక్షకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో టీఎస్‌ఎస్‌యూఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్ , బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్, ఉద్యోగులు పాల్గొన్నారు. -వికారాబాద్, డిసెంబర్ 16



## రాష్ట్ర స్థాయి చెకుముకిలో ఇర్విన్ విద్యార్థుల ప్రతిభ

చెకుముకి సైన్స్ సంబురాల్లో భాగంగా ఆదిలాబాద్‌లో మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించారు. ఇందులో ఇర్విన్ జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఆకుతోట ప్రోహిత్, సూదిని నచ్చేకేత్, ఆకుతోట శివకుమార్‌లు తెలుగు విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలకు ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, డీఈవో ప్రణీత బహుమతులు అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు పార్వతాలు తెలిపారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది. కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, బాలూనాయక్ తదితరుల పాల్గొన్నారు. -మాడ్గుల, డిసెంబర్ 16

# ప్రశ్నిస్తే..అక్రమ కేసులు, అరెస్టులు

- కాంగ్రెస్ పాలనలో అన్ని అవస్థలే..
- రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతున్నది
- మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి
- నేడు 'తెలంగాణ భవన్‌కు భారీగా తరలి వెళ్దాం..మన సత్తా చాటుదా'మని వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

కొడంగల్, డిసెంబర్ 16 : కాంగ్రెస్ నిరంకుశ పాలనలో ప్రజలు అన్నింటా ఇబ్బంది పడుతున్నారని..పాలకులు.. ప్రశ్నిస్తే అక్రమ కేసులతో అరెస్టు చేసి జైల్లో పెడుతున్నారని షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి మండిపడ్డారు. కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం తెలంగాణ భవన్‌కు తరలివెళ్లేందుకు సన్నాహక కార్యాచరణలో భాగంగా సోమవారం స్థానిక మంజునాథ ఫంక్షన్ హాల్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అన్ని వర్గాల వారు అవస్థలు పడుతున్నారన్నారు. రైతులకు అండగా నిలిచినందుకు లగచర్ల ఘటనలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిపై అక్రమంగా కేసు బనాయించి జైల్లో పెట్టారన్నారు. మాజీ ఎమ్మెల్యేతోపాటు రైతులకూ బెయిల్ రాకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే అరెస్టైన నాటి నుంచి కొడంగల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద అండను కోల్పోయారని.. అందుకు వారికి భరోసా కల్పించేందుకే మంగళవారం తెలంగాణభవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి.. సమస్యలు, ఇబ్బందులకు ఆయన దృష్టికి తీసుకెళ్దామన్నారు. దాదాపు 200లకు పైగా ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌కు తరలి వెళ్లేందుకు కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. భారీగా తరలివెళ్దాం..కొడంగల్‌లో బీఆర్‌ఎస్ సత్తా ఏమిటో సీఎంకు చూపుదామని పిలుపునిచ్చారు. పాలకులు ఎన్ని కుట్రలు పన్నినా మాజీ ఎమ్మెల్యేతోపాటు రైతులు కడిగిన ముత్యంలా త్వరలోనే జైలు నుంచి బయటికి వస్తారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్యాసం రామకృష్ణ, కృష్ణ, యాదగిరి, మహిపాల్, చాంద్‌పాషా పాల్గొన్నారు.

# దివ్యాంగులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### రంగారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి శ్రీలత

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి శ్రీలత





ఆదిబట్ల, డిసెంబర్ 16 : ప్రభుత్వ పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి శ్రీలత అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి, జిల్లా సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగులు తమకు కేటాయించిన పనులను సక్రమంగా నిర్వహిస్తున్నారని.. వారు పని చేసే ప్రాంతాల్లో ర్యాంపులు, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అనంతరం జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి సంధ్యారాణి మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహాచారి మాట్లాడుతూ అన్ని కార్యాలయాల్లో దివ్యాంగులకు వసతులు కల్పించాలని, సదరం సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగకుండా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కీచక ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

### ధారూరు స్టేషన్‌వాసులు, యువతుల పేరెంట్స్ డిమాండ్

ధారూరు, డిసెంబర్ 16 : పవిత్రమైన వృత్తిలో ఉండి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన టీచర్ కిష్టయ్యపై విద్యాశాఖ చర్యలు తీసుకోవడంతోపాటు పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని ధారూరు స్టేషన్ వాసులు, యువతుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. గతంలో కిష్టయ్యపై నవాబుపేట ఠాణా పరిధిలో పోక్సో కేసు నమోదై.. జైలుకెళ్లొచ్చినా అతడి తీరు మారలేదన్నారు. అతడిని అరెస్టు చేసి చర్యలు తీసుకోకపోతే నిరసనకు దిగుతామని హెచ్చరించారు

# బోర్డు తిప్పేసిన ఎస్ఎల్ఎన్‌కే చిట్‌ఫండ్

- రూ.2 కోట్లు బురిడీ కొట్టించిన యాజమాన్యం
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

పరిగి, డిసెంబర్ 16 : మీ సొమ్ము మా వద్ద భద్రం, మా దగ్గర చిట్టీలు వేయండి సమయానికి డబ్బులు తీసుకోండి, మా దగ్గర డిపాజిట్ చేయండి అధిక ఆదాయం పొందండంటూ ఆకర్షణీయమైన మాటలు చెప్పి చిట్టీలు వేయించుకోవడంతో పాటు లక్షలాది రూపాయలు డిపాజిట్ చేయించుకొని చివరకు బోర్డు తిప్పేసింది ఎస్ఎల్ఎన్‌కే చిట్‌ఫండ్ సంస్థ. గతంలో మరో పేరు పొందిన సంస్థలో పనిచేసిన ఉద్యోగులు పరిగి పట్టణంలోని బహార్‌పేట్‌లో ఏర్పాటుచేసిన ఎస్ఎల్ఎన్‌కే చిట్‌ఫండ్ సంస్థలో ఉద్యోగులుగా చేరి మీ సొత్తుకు మాది పూచీ అని నమ్మబలికారు. దీంతో చాలామంది రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు చిట్టీలు వేశారు. కొద్ది రోజులపాటు ఎవరికీ అనుమానం రాకుండా నడిపిన చిట్‌ఫండ్ సంస్థ డబ్బులు తిరిగి ఇచ్చే సమయానికి చేతులెత్తేసింది. చిట్‌ఫండ్ సంస్థ కార్యాలయంగా కొనసాగుతున్న భవనానికి 2022 నుంచి ఇప్పటివరకు అద్దె సైతం ఇవ్వకుండా, భవనాన్ని ఖాళీ చేయకుండా ముప్పతిప్పలు పెడుతున్నారు.

అలాగే తాను వేసిన చిట్టీ డబ్బులు సైతం ఇవ్వలేదని భవన యజమాని రమేశ్ తెలిపారు. పరిగికి చెందిన ఓ వ్యక్తి భూమిని విక్రయించగా వచ్చిన డబ్బులను చిట్‌ఫండ్ సంస్థ ఉద్యోగుల మాటలు నమ్మి రూ. 20 లక్షలు డిపాజిట్ చేశారు. అలాగే సుమారు రూ.50 లక్షల చిట్టీలు సైతం వేశాడు. కేవలం రూ.15 లక్షల చిట్టీకి సంబంధించిన డబ్బుల్లో రూ. 4.85 లక్షలు ఇచ్చిన చిట్‌ఫండ్ సంస్థ నిర్వాహకులు మిగతా డబ్బులు ఇప్పటికీ ఇవ్వలేదు. సదరు వ్యక్తికి సుమారు రూ.38 లక్షల వరకు రావాల్సి ఉన్నట్లు సమాచారం. తమ పేర్లు రాయొద్దని, పేర్లు బయటికి వస్తే వారు డబ్బులు ఇస్తారో లేదోనని బాధితులు ఆందోళన చెందుతున్నారు. కాగా బాధితులందరికీ సుమారు రూ.2 కోట్ల వరకు చిట్‌ఫండ్ సంస్థ వారు చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారం. గత నాలుగైదు నెలల కిందటే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా... పోలీసులు చిట్‌ఫండ్ నిర్వాహకులను పిలిపించి మాట్లాడగా..నాలుగైదు నెలల్లో మొత్తం డబ్బులిస్తామని వారు చెక్కులు ఇచ్చారు. ఇప్పటివరకూ డబ్బులు ఇవ్వకపోవడంతో సోమవారం బాధితులు మరోసారి పరిగి డీఎస్పీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన డీఎస్పీ.. పరిగి సీఐ దగ్గర ఎవరెవరికీ ఎంత మొత్తం రావాలో వివరాలు నమోదు చేయడంతోపాటు ఫిర్యాదు చేయాలని, తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు బాధితులు పేర్కొన్నారు.



పరిగి డీఎస్పీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

# మాలలను కించపరిస్తే సహించం

### భీమ్ మిషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు మందాల భాస్కర్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 16 : మాలలను కించపరిచేలా మాట్లాడితే సహించబోమని భీమ్ మిషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మందాల భాస్కర్ అన్నారు. ఇప్పటికైనా మందకృష్ణ మాదిగ తన వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. లేని పక్షంలో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భాస్కర్ మాట్లాడుతూ.. యావత్ సమాజాన్ని చైతన్యం చేసింది మాలలేనన్నారు. నాటి కారంచేడు ఘటనలో మాదిగలకు అండగా నిలిచింది మాలలేనని, మాదిగలకు న్యాయం కోసం ముందుండి పోరాడిందీ మాలలు కాదా అని ప్రశ్నించారు. చరిత్ర మరచిన మందకృష్ణ నోటికొచ్చినట్లు మాట్లాడితే లక్ష గొంతులై తిరగబడతామని హెచ్చరించారు. ఈనెల 27న లక్ష డప్పులతో మాలలకు చావు డప్పు కొడతామని.. మందకృష్ణ అహంకార పూరితంగా మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా మాలలపై విషం చిమ్మే మాటలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంగరి ప్రదీప్, నాయకులు మాదాసు రాహుల్, పండుగ భానుతేజ, ప్రదీప్, మల్లికార్జున్, యశ్వంత్, అభిషేక్, బాలు తదితరులు పాల్గొన్నారు.

